## క్లుప్తంగా

### ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఐనవోలు : పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సింగారం గ్రామ శివారులో చర్చికి వెళ్లే దారిలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద కొందరు పేకాడుతున్న అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,810 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

### యువకుడి మృతితో విషాదం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన గోరంట్ల కిరణ్ (28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. వరంగల్‌లోని బంగారు షాపులో పని చేస్తున్న గోరంట్ల కిరణ్ (28) స్థానికంగా అందరితో కలివిడిగా ఉండేవాడు. పని ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సోమవారం రాత్రి ఆయన ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టగా అతడు మృతి చెందిన విషయం తెలిసిందే. కిరణ్ తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. మృతుడికి ఇద్దరు సోదరులున్నారు. కిరణ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### వ్యక్తి అదృశ్యం



ఐనవోలు : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గుండపు నర్సయ్య వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నర్సయ్య కనిపించడం లేదంటూ అతడి కొడుకు రవితేజ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నర్సయ్య ఇటీవల తనకు చెందిన ఆరు గుంటల భూమి కుటుంబ సభ్యులకు తెలియకుండా అమ్ముకున్నాడు. ఈ విషయంలో నర్సయ్యకు, అతడి కొడుకులకు మధ్య ఆదివారం గొడవ జరిగింది. ఈ క్రమంలోనే నర్సయ్య మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఏరియాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిరూప్‌నగర్‌తండా మెయిన్ రోడ్డు, రైల్వేగేట్, ప్రధాన రహదారుల్లో విద్యుత్ స్తంభాలు మార్చే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముచ్చర్లకు చెందిన మట్టెడ బుచ్చమ్మ కుటుంబానికి స్థానిక నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి చేయూతనిచ్చారు. మంగళవారం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శ్రీధర్, పాల్, శ్రవణ్, బండ సాయిరెడ్డి, బైరి సుధాకర్‌రెడ్డి, మట్టెడ కర్ణాకర్, అనీల్ పాల్గొన్నారు.

### ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీ అరికట్టాలి



విద్యారణ్యపురి : ప్రైవేటు స్కూళ్లలోని ఫీజుల దోపిడీని అరికట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య( డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హైని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తిరుపతి, చిరంజీవి మాట్లాడారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్మిస్తామని తిరుపతి, చిరంజీవి చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత

- 'విద్యా వారధి' జిల్లా అధ్యక్షుడు సారయ్య

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని విద్యా వారధి సంస్థ జిల్లా అధ్యక్షుడు భీమళ్ల సారయ్య కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యాబోధన అందుతోందని చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో సమాజంలోని ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి పరిరక్షించాలని సూచించారు. అనంతరం స్థానిక హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, తదితర అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. బడిబాటలో భాగంగా 8 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో తిరిగి 15 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చారని ఆ స్కూల్ హెచ్‌ఎం చెప్పారు. సర్పంచ్ గోకె రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు వారి పిల్లలను ఖచ్చితంగా ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పాలని కోరారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సూరిబాబు, మధూకర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు : బడిబాటలో సారయ్య, తదితరులు



శాయంపేటలో..



ఎల్కతుర్తిలో..

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని తెలిపారు. మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతిపై అవగాహన కల్పించేలా ముద్రించిన ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. స్కూల్ టెన్త్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. క్రీడల్లో, పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండు సదానందం, ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

**'ప్రైవేట్'కు దీటుగా..**

ఎల్కతుర్తి : ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన లభిస్తోందని స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆమె మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. 14 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలమురళీకృష్ణ, వాణి, రాధిక, కృష్ణ పాల్గొన్నారు.

# నేడు మంత్రి కేటీఆర్ రాక

- హెలీపాడ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : మండలంలోని దుర్గంపేట గ్రామ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో జరగనున్న తన కూతురు జాహ్నవి–అంకిత్‌రెడ్డి వివాహ విందు కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కేటీఆర్ రానున్నట్లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. కేటీఆర్ రాక సందర్భంగా చేపట్టిన హెలీపాడ్ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మధ్యాహ్నం 1.30 గంటలకు ములుగు నుంచి హెలీకాప్టర్ ద్వారా బయల్దేరి 2 గంటలకు కన్వెన్షన్ హాల్‌కు చేరకుని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌కు హెలీకాప్టర్ ద్వారా తిరిగి వెళ్లనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, రైతుబంధు మండల కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, సీఐ కుమార్, ఎస్సై ముత్యం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



పరకాల : సమ్మె పోస్టర్ అతికిస్తున్న డీలర్లు



శాయంపేట : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న..

పరకాల : తమ సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చందుపట్ల రాజేందర్‌రెడ్డి, బొచ్చు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలో ఈనెల 7 నుంచి తలపెట్టిన సమ్మె పోస్టర్లను రేషన్ షాపులకు మంగళవారం అతికించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడారు. మండలవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

**నేటి నుంచి నిరాహార దీక్ష**

శాయంపేట : నేటి (బుధవారం) నుంచి రేషన్ డీలర్ల నిరాహార దీక్ష మొదలౌతుందని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సామల మల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి అమ్మ అశోక్, నాయకులు దానబోయిన అశోక్, హైదర్, అమరేందర్‌రెడ్డి, బాపూరావు, అల్లాఉద్దీన్, రవి, సాంబయ్య, శంకర్, శిరీశ, రమేశ్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి



శాయంపేట : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎల్కతుర్తిలో..

శాయంపేట : కొత్తగూడెంలో ఈనెల 11న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగ సభకు కార్మికులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారు సర్వే నంబర్ 633లోని గుడిసెల వద్ద సభ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజాగర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. బ్యాంకులు, ఎల్ఐసీ, టెలీకామ్, తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని తెలిపారు. నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, గుడిసెవాసులకు పట్టాలివ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మండల నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, మారపల్లి క్రాంతికుమార్, రమాదేవి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రజాగర్జన సభ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కర్రె లక్ష్మణ్, నిమ్మల మనోహర్, మర్రి శ్రీనివాస్, రాజకొమురయ్య, మంతుర్తి మల్లయ్య, తిరుమల, కోమల, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుడికి సన్మానం



శాయంపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐటీ పార్క్ ఆవరణలో మంగళవారంలోని నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో శాయంపేట చేనేత సహకార సంఘం కార్మికుడు బాసాని నవీన్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ ఏడీ రాధికరెడ్డి, డీఓ పిజ్జ వెంకటేశ్వర్లు, పాలకవర్గ సభ్యులు బాసాని సాంబయ్య, బూర లక్ష్మీనారాయణ, దిడ్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



శాయంపేట : మొక్కలు నాటి పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇటుకబట్టీలపై చర్యలు తీసుకోవాలి

శాయంపేట : ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన ఇటుక బట్టీలు నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం, అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకులు మొగ్గం సుమన్, నాగుల పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ చల్ల రాజును కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సుమన్, పవన్ కల్యాణ్ మాట్లాడారు. హైవేకు కిలోమీటర్ దూరంలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలన్న నిబంధనను యాజమాన్యాలు ఉల్లంఘించాయని తెలిపారు. మండలంలోని మాందారిపేట గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఇటుక బట్టీలు ఉండడంతో అందులో నుంచి వస్తున్న పొగతో గ్రామస్తులతోపాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఇటుక బట్టీల్లో తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సుమన్, పవన్ కల్యాణ్

# పరకాలలో టీడీపీ బలోపేతమే లక్ష్యం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌చారి

నడికూడ : పరకాల నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నోజు శ్రీనివాస్‌చారి కోరారు. మండల కేంద్రంలో 'గడప గడపకు గన్నోజు..' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రజలతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యక్రమాలు రూపొందిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, నాయకులు లక్కం ప్రకాష్, గంగబోయిన రవీందర్, రామన్న, దిలీప్, శివ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రేపు చెరువుల పండుగ నిర్వహించండి



మాట్లాడుతున్న ఎంపీపీ మేకల స్వప్న

ఎల్కతుర్తి : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రేపు (గురువారం) ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత కోరారు. ఆయా మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మృదిరాజ్ కులస్తులు పాల్గొనాలని చెప్పారు. కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మ, కోలాటాల నడుమ పండుగను నిర్వహించాలని తెలిపారు. సమావేశాల్లో ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, తహసీల్దార్లు గుజ్జుల రవీందర్‌రెడ్డి, హరికృష్ణ, వైస్‌ఎంపీపీ తంగెడ నగేశ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొర్గుల రామారావు, సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, సాతూరి స్వాతి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు అండగా 'సఖి'

దామెర : కష్టాల్లో ఉన్న మహిళలకు 'సఖి' కేంద్రం అండగా ఉంటుందని ఐకేపీ ఏపీఎం ఝాన్సీ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి, తదితర సమస్యల సందర్భంగా అండగా నిలిచేందుకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సఖి వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. సఖి సెంటర్‌లో లభించే సేవల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్లు వినీల, స్వర్ణలత మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సమస్యలున్నా సాయం కోసం 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సాయం పొందాలని కోరారు. సఖి సెంటర్‌లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్, తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ, వైద్యం సేవలు ఉచితంగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వీఓలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కౌన్సెలర్ వినీల

## డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుభాషిణికి డాక్టరేట్



పరకాల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం విభాగం అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న పి.సుభాషిణికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జగదీష్ నాయక్ పర్యవేక్షణలో 'ఎఫిసవీ ఆఫ్ జీప్రోమిన్ అండ్ ఫిష్‌విన్ ఫీడ్ అడిటివీస్ ఆన్ బయోకెమికల్ అండ్ గ్రోత్ ఆఫ్ ఇండియన్ మేజర్ కార్ప్స్' అంశంపై ఆమె చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పి.సుభాషిణిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా వారిలో ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, ఏడుగురికి రూ.11,900 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగరరావు తీర్పు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం మత్తులో చిక్కిన వారిలో మారవేని రాజ్‌కుమార్, చుక్కా ప్రవీణ్‌లకు న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

# పశువులకు టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశు వైద్యాధికారి బాలకృష్ణ

నడికూడ : పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి బాలకృష్ణ రైతులను కోరారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పశువులకు మంగళవారం గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గొంతువాపు వ్యాధి వల్ల పశువులకు తీవ్రమైన జ్వరం వస్తుందని, మేత మేయకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని, పశువు నీరసించి మృతి చెందే ప్రమాదమూ ఉందని వివరించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, పశు వైద్య సిబ్బంది కల్పన, అశోక్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యం

మడికొండ : పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం 46వ డివిజన్ రాంపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు లబ్ధిదారులకు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, తక్కళ్లపల్లి రాంగోపాల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు విజయ్‌రావు, దేవేందర్‌రావు, మధు, సంద్ర కుమార్, కోతి యాదగిరి, మునిగాల డానియేల్, పిట్టల రమేష్, మాదాసి యాదగిరి, దేవయ్య, రాజు, జాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

# చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కాజీపేట: కదులుతున్న రైలు నుంచి పడి గాయపడిన యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై పరశురాములు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఈ నెల 2న నష్కల్ రైల్వే యార్డ్ వద్ద గుర్తు తెలియని యువకుడు పడి ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో కోలుకోవడం కష్టంగా మారి యువకుడు మృతి చెందినట్టు చెప్పారు. మృతదేహాన్ని గుర్తించడం కోసం ఎంజీఎం ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 98663 30256, 94932 01968 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

# ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

కాజీపేట: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక చాలా మంది ప్రాణాలను కోల్పోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆరోకీయా మేరీ పిలుపునిచ్చారు. 48వ డివిజన్ ఫాతిమానగర్ సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో మంగళవారం యా బ్లడ్ యాప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యాప్ ఫౌండర్ డాక్టర్ జగదీష్ బాబు యలమంచిలిని సంఘ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా ప్రమోటర్ చిలువేరు శంకర్ మాట్లాడుతూ బాలీవుడ్ నటుడు సోనూసూద్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండడం యాప్‌కు అదనంగా కలిసి వచ్చే అంశంగా పేర్కొన్నారు.

# ఆర్‌సీఓపై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మూడు గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వకుండా గుత్తేదారులకు అమ్ముకున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల రీజనల్ కోఆర్డినేటర్ పై చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు స్టీమ్ భోజనం అందించాలి, కానీ కట్టెల పొయ్యితో విద్యార్థులకు సమయానికి భోజనం అందించకుండా గుత్తేదారులు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే సదరు కాంట్రాక్టర్, ఆర్‌సీఓపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు.